# బ్రోవ భారమా! రఘురామ! భువనమెల్ల నీవై ఉండగా! నన్నొక్కని బ్రోవ భారమా?



యావద్భారతీయుల్లోనూ అధిక రామభక్తి కలవారు తెలుగువారే! రామదాసు (కంచర్ల గోపన్న) గానీ, వావిలకొలనువారు గానీ, మొన్న మొన్నటి విశ్వనాథ వారుగానీ రామభక్తికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. రాముని గుడిలేని పల్లెగానీ, పట్నంగానీ, కొండగానీ, కోనగానీ లేనే లేదు. గృహాల్లో ఒక్కరికైనా శ్రీరాముని నామధేయం ఉంటుంది. ఆడపిల్ల పుడితే 'సీత' పేరు పెట్టుకుంటారు. సీతామహాలక్ష్మి యని పిలుస్తారు. పెళ్ళి శుభలేఖల్లో 'జానకి'తో ప్రారంభించి శ్రీరామవైవాహికాయని ముగిస్తూ శుభలేఖలో శ్లోకాన్ని శుభప్రదంగా భావించి వేస్తారు. సీతమ్మ మాయమ్మ, శ్రీరాముడు మాకు తండ్రి, భరత, లక్ష్మణ, శతృఘ్నులు మా భాతృవర్గమే, శాంత మాసోదరీయే అంటాం.

అందుకే త్యాగరాజులవారు అండ కోట్లను కుక్షిని యుంచుకున్న నేనొక్కణ్ణీ భారమటయ్యా – బ్రోవ భారమా! రఘురామా' యని అడిగారు. 'రామ' అనే నామంలో అంతటి భక్తి, అంతటి ప్రీతి, అంతటి పవిత్రత, అంతటి మహిమ ఉన్నది. రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా – అనే అహల్యా శాపవిమోచనం విని, ఏ పురాణముల నెంత వెదికినా, శ్రీపతి దాసులు చెడరు' అంటారు అన్నమయ్య. శ్రీ వేంకటపతినే అన్నమయ శ్రీరామచంద్రునిగా తలపోసాడు. సుప్రభాతకర్త వేంకటచలపతి మేలుకొలుపులో **'కౌసల్యా సుప్రజారామా, పూర్వా సంధ్యా ప్రపత్తతే'** యని ప్రారంభించాడు.

**రాముడు రాఘవుడు రఘుకులడితడు**
**భూమిజకుపతియైన పురుష నిధానము**

– పురుష నిధానము అను కొత్తగా కనిపించవచ్చు – కాని అన్నమయ్య పురుషత్వానికి ఆధారము అంటే ఆశ్రయం, అధినాధిపత్యం అర్థంలో ఉపయోగించాడు. అందుకే శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత దశమో ధ్యాయంలో పవనః, **పవతామస్మి, లాయః శస్త్ర, భృతామహమ్' –** పావనమొనర్చు వాటిలో వాయువును, శస్త్రధారుడైన శ్రీరాముణ్ణే తానేనని చెప్పడం జరిగింది.


నవ విధ రామభక్తి మార్గాల్లో తరించిన వారు 'రామాయణం'లో మన స్మరణకు వస్తారు. భక్తుల మానసిక స్థాయినీ, అంకిత భక్తి మార్గాన్నీ, పావనత్వాన్నీ బట్టి, నవవిధ భక్తిమార్గాలు!

**శ్రవణం, కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్ ।**
**అర్చను వందనం దాస్యం సఖ్యమాత్మని వేదనమ్**

– ఆంజనేయుడు, వాల్మీకి, సీతాదేవి, భరతుడు, శబరి, విభీషణుడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, జటాయువు – ఈ తొమ్మిది విధ భక్తులకు నిదర్శనంగా చెప్పుకోవలెను.

రామనామ శ్రవణం ద్వారా ఆంజనేయుడు, చరితాకీర్తనం చేసిన వాల్మీకి, సదా రాముణ్ణే ప్రాణాధారునిగా చేసికొన్న సీతాదేవి, పాదసేవకునిగా భరతుడు (రాముని పాదుకలను శిరమున ధరించి, వాటినే సింహాసనంపై ప్రతిష్ఠించి, తాను నిమిత్తమాత్రునిగా పాదసేవనం చేస్తూ దాస్యపాలనం చేసాడు.

అనన్యభక్తితో అర్చనం సేవ చేస్తూ, ఆరామ దర్శనమయ్యే వరకూ నిరీక్షించి, నిరీక్షించి, లక్ష్మణ సమేతుడై శ్రీరాముని దర్శనం పొందిన ధన్యురాలు శబరికి వందనం, రామ పాదాభివందనం అంటూ – సీతను విడిచిపెట్టు, శ్రీరాముని శరణు వేడు అన్న పుణ్యానికి అన్న రావణునిచే వెళ్ళగొట్టబడిన విభీషణుడు శ్రీరాముని శరణుజొచ్చి, శ్రీరాముని ఔదార్యంతో రావణ వధానంతరం, లంకా రాజ్య సింహాసనాధిష్ఠుడైన వాడు విభీషణుడు. లక్ష్మణుడు పుట్టిన దాది, శ్రీరాముని తోడుగ నీడగా ఉంటూనే, అడవుల్లో పధ్నాల్గేండ్లు వనచరుడై, రావణ వధలో తోడై, సీత రామాంజనేయ సమేతంగా అయోధ్యకు వచ్చి ఏ పదవినీ ఆశించక, పై లోకాలకు వెళ్ళే వరకూ పవిత్ర హృదయుడై సీతారాముల కనురెప్పలుగా చూచుకొంటూ దాస్యం చేసుకున్న శేషాంశుడు లక్ష్మణుడు.



సఖ్యంలో సుగ్రీవుణ్ణి చెప్పుకోవాలి. సీతాన్వేషణలో అహరహమూ కృషి చేసి, శ్రీరాముణ్ణి సఖ్యంతో రాజ్యరమనూ, సతీ రమణనూ తిరిగి పొంది తరించిన వాడు సుగ్రీవుడు.

ఆత్మనివేదనం భక్తితో సీతాపహరణం చేస్తూన్న రావణునెదిరించి, బహువిధాల రెక్కలతో పోరాడి, రావణుని కత్తికి రెక్కలు కూలిపోయి, రాముడొచ్చే వరకూ వేచియుండి ప్రాణాలను విడిచినవాడు జటాయువు. రామచంద్రుని చేతనే దహన సంస్కారములు పొంది ధన్యత నొందిన ఆత్మనివేదకుడు జటాయువు.

మాటకు విలువిచ్చేవాడు, ప్రాణుల పట్ల ద్వేషం భావం లేని మర్యాదరాముని కెంతో మంది సేవించి ముక్తిని పొందారు. నవవిధ భక్తి మార్గాల్లో తరించిన వారిని స్మరించుకుంటే మనకూ ముక్తి సిద్ధిస్తుంది.



అమ్మా! జనని జానికమ్మా – అలా చూస్తున్నావేఁమిటమ్మా! రాముడు కల్యాణం నాడు తలపై పోసిన తలంబ్రాలను తలచుకుని కులుకుతున్నావా? నీవు తలవంచినట్లే వొంచి, అంత ఎత్తునున్న రాముని శిరముపై, పాదయుగళముపై జూడేట్టూ తలంబ్రాలు ఎలా పోసావమ్మా! సిగ్గు నటించావే గాని బుగ్గల నిగ్గు నెరుపులు నీ దోసిట తలంబ్రాలలో ఎర్రని కెంపుల్లా ఉండి, నీ దోసెళ్ళ నుంచీ జారేటప్పుడు ధగధగమనే ముత్యాలూ, రత్నాలై రామయ్య శిరముపై బడినప్పుడు నీలమణులయ్యాయని తలచుకుని తలచుకుని మురిసి ఒరిసిపోతున్నావేమిటమ్మా!

లేదా శ్రీకరమైన అయోధ్యా నగరంలోని మణిమయ మందిరంలో రామయ్యతో ఏకాంతంగా ఉన్నప్పుడే శ్రీరాముణ్ణి భక్తిప్రేమలను రంగరించి, ముక్తి కొఱకు అనేక మార్గములున్నాయ్ కదా! ఏది సులభమార్గమని అడిగినప్పుడు మహాలక్ష్మివైన నీవెరుంగవా తల్లీ! అయినా ఆయన సీత పాటగా చెప్పిన పదాలను తలచుకుని అదోముఖంగా ఆబ్రహ్మవర్చస్సు గల పండితుణ్ణి చూచి పునశ్చరణం చేసుకుంటూ పులకించిపోతున్నావా తల్లీ!

**అనవుండు మందహాసాస్యుడై రాముడిట్లనియె సీతకు వినవె సీతా ।**
**జనకనందన వేదసారార్థమడిగితివి వినుమది రహస్యమె సీతా ।**
**అష్టాంగ యోగములు కష్టసాధ్యములగుట శిష్టులు మెచ్చరే సీతా**
**నిష్టంబు సేయుదురు భ్రష్ట విజ్ఞానులై సీతా !**

– అంటూ –159 పాదాలతో సీత పాటగా చెప్పి, మధ్యంతమున గోప్యంగా, అంత్యమున ఆప్యాయంగా చెప్పిన ముగింపు ఇలా ముగ్ధస్నిగ్ధంగా ఉంది కదమ్మా!

**ఈ పాట చదువువారా పగిది నొందుదురు శ్రీపతి స్థానమో సీతా!**
**ఈ పాట వ్రాయువారే ప్రొద్దుదలచి నన్నే పొందుదురు సుమి సీతా!**
**అనుచు బోధించి నిజహస్తంబు మస్తకంబున చేర్చి యిది నమ్ము సీతా!**
**వినుమది రహస్యంబు వేదాంసారమిది యనుభవముగ చూడు సీతా–**
**కనుగొంటినే తమ్మికంటి ముక్కంటులకు కానరాని నిన్ను శ్రీరామ**
**అనుభవంబయ్యె నీ యర్థమంతయు నేడు నను నేనుగంటి శ్రీరామ!**
**ధన్యనైతిని యన విని, కౌగలించి సుఖవనధి నిద్దరు నోలలాడి**
**దయతోడ భద్రగిరి తటమునను**
**నెలకొనిరి ప్రియ భక్తులను బ్రోచు కొరకు!**
**జయ రామ శ్రీరామ జానకీ ప్రియరామ జయ భద్రగిరిరామ! శరణు!**

ఈ సీత పాట అర్థం ఎవరికీ ఎరుక కాదు. నీ యందుకల ప్రేమతో నీకు తెలిపినాను. సాధకులు యిది విని సంతసిస్తారు. ఈ పాటను విన్నవారు పాపములంటకుండా ధన్యులై పరమాత్మలో లీనమవుతారు.

ఈ పాటను చదివానవారు శ్రీపతిస్థానం పొందుతారు. ఈ పాటను శ్రద్ధతో వ్రాసినవారు నన్నే చేరుకుంటారు – అని శ్రీరాముడు సీతకు బోధించి, హస్త మస్తక సంయోగం చేసి – "సీతా! రహస్యమైన వేదాంతసారం నీకు బోధించాను. నమ్మి కృతార్థులరాలవు కమ్ము – అని రామయ్య తండ్రి అనగా విని – ఆనంద భాష్పములు చిందగా, సీత – బ్రహ్మాదులు కనుగొనలేని నిన్ను తెలుసుకున్నాను. చెప్పిన విషయం అనుభవమై నన్ను నేను తెలుసుకున్నాను. ధన్యురాలనైతినని సీత చెప్పగా – అప్పుడు సీతారాములు ఆనందంతో భక్తులను తరింపచేయడానికి భద్రగిరిలో వెలిసారు – అని సీతపాటి సారాంశము.

ఇంతకూ సీతారామయ్యల అనుకూల దాంపత్యంలో గ్రహించవలసినదేమన – శ్రీరాముడు ఆలోచనగా సీతమ్మ తల్లి ఆచరణగా జగతి ఉన్నంత కాలం భక్తజగతి ప్రగతిలో నడుస్తుంది. అడ్డు ఆటంకాలను తరిమేస్తుంది.